# ప్రభాత సూర్యుడు

తెలుగు దినపత్రిక

RANGAREDDY, EDITION : 01, VOLUME :112 EDITOR:CHERUKU UPENDAR, DATE : SUNDAY 27 AUGUST 2023 PAGES:4, RATE: Rs.5/-

రంగారెడ్డి సంపుటి : 01 సంచిక : 112 ఎడిటర్ : చెరుకు ఉపేందర్ తేదీ : ఆదివారం 27 ఆగస్టు 2023 పేజీలు : 4 వెల : 5/-


## ఖర్గేకు ఘన స్వాగతం



హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు

హైదరాబాద్‌కు చేరుకున్న ఏఐసీసీ అధ్యక్షులు మల్లికార్జున్ ఖర్గేకు . శంషాబాద్ ఎయిర్ పోర్ట్ లో ఘన స్వాగతం లభించింది. ఏఐసీసీ ఇంచార్జ్ మానిక్ రావ్ ఠాక్రే, టీపీసీసీ అధ్యక్షులు రేవంత్ రెడ్డి, సీఎల్పీ నేత భట్టి విక్రమార్క తదితరులు అయన స్వాగతం పలికారు.

మిగతా 2లో...

### తమిళనాడులో

## ఘోర రైలు ప్రమాదం



చెన్నై- ప్రభాత సూర్యుడు

తమిళనాడులోని ఘోర రైలు ప్రమాదం జరిగిన సంగతి తెలిసిందే. శనివారం తెల్లవారుజామువ 5.15 గంటల సమయంలో మధురై రైల్వే స్టేషన్‌లో ఆగిఉన్న ఓ రైలుబోగీలో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. ఈ దుర్ఘటనలో ఇప్పటివరకు 10 మంది దుర్మరణం చెందారు. అయితే ప్రమాదం ఎలా జరిగిందో కూడా అధికారులు తెలిపారు. అక్రమంగా రైల్లోకి తీసుకొచ్చిన

మిగతా 2లో...

# జై విజ్ఞాన్.. జై అనుసంధాన్

**అంటూ ఇస్రో శాస్త్రవేత్తలను అభినందించిన ప్రధాని**

- ఆగస్టు 23న 'అంతర్జాతీయ అంతరిక్ష దినోత్సవం'గా ప్రకటన
- 8 కిలోమీటర్లు ప్రయాణించిన 'ప్రజ్ఞాన్'
- చంద్రయాన్-3 ల్యాండింగ్ ప్రదేశానికి శివశక్తిగా నామకరణం




హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు

చంద్రయాన్-3 విజయం ఊపు ఇంకా తగ్గలేదు. ఏదో చోట ఆ బజ్ కనిపిస్తోనే ఉంది. ఇంతటి గొప్ప విజయం సాధించిన టైంలో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ విదేశాల్లో ఉన్నారు. బ్రిక్స్ సదస్సులో పాల్గొనేందుకు దక్షిణాఫ్రికా వెళ్లారు. అక్కడి నుంచే ఈ విజయాన్ని ఆస్వాధించారు. వర్చువల్‌గా ఇస్రో సంబరాల్లో పాల్గొన్నారు.ప్రపంచమే ఆశ్చర్యపోయే విజయాన్ని సొంత చేసుకున్న ఇస్రో శాస్త్రవేత్తలను నేరుగా అభినందించాలని ప్రధాని నిర్ణయించుకున్నారు. దక్షిణాఫ్రికా, గ్రీస్ పర్యటన తర్వాత తన షెడ్యూల్‌ను పూర్తి గా మార్చేశారు. నేరుగా ఢిల్లీ రాకుండా బెంగళూరులో ల్యాండ్ అయ్యారు. గ్రీస్ పర్యటన ముగించుకొని బెంగళూరు వచ్చిన ప్రధానమంత్రి మోదీకి

మిగతా 2లో...

### ధరణిలో

## 8 కొత్త ఆప్షన్లు




వరంగల్ - ప్రభాత సూర్యుడు

ధరణి పోర్టల్‌లో మరికొన్ని మార్పులు చేసింది తెలంగాణ సర్కార్. తాజాగా మరో 8 ఆప్షన్లను అందుబాటులోకి తీసుకొచ్చింది. ధరణిలో ఉన్న పలు సమస్యలకు పరిష్కారం చూపుతూ కీలక నిర్ణయం తీసుకుంది తెలంగాణ సర్కార్. ప్రజల నుంచి వస్తున్న ఫిర్యాదుల మేరకు? తాజాగా కొత్తగా 8 ఆప్షన్లను అందుబాటులోకి తీసుకువచ్చింది. ఈ మేరకు గురువారం ఆదేశాలు జారీ చేసింది. కొత్త ఆప్షన్లతో జిల్లాల్లో నెలకొన్న

మిగతా 2లో...

## కేసీఆర్‌తో పోటీకి రాములమ్మ

నిజామాబాద్- ప్రభాత సూర్యుడు

తెలంగాణలో అసెంబ్లీ ఎన్నికల హడావిడి మొదలైంది.. ఏకంగా ఒకేసారి 115 అసెంబ్లీ స్థానాలకు అభ్యర్థులను ప్రకటించిన బీఆర్ఎస్ అధినేత, ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు మరింత హీట్ పెంచారు.. అయితే, ఈ సారి ఆయన రెండు నియోజకవర్గాల నుంచి బరిలోకి దిగబోతున్నారు.. హైదరాబాద్‌లోని ప్రగతి భవన్‌లో అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించిన బీఆర్ఎస్ అభ్యర్థుల తొలి జాబితాను విడుదల చేసిన ఆయన.. తాను ప్రస్తుతం ప్రాతినిధ్యం వహిస్తోన్న గజ్వేల్‌తో పాటు కామారెడ్డి అసెంబ్లీ స్థానం నుంచి కూడా పోటీకి దిగనున్నట్టు ప్రకటించారు. మరోవైపు కామారెడ్డిలో కాంగ్రెస్ నుంచి సీనియర్ నేత షబ్బీర్ అలీ పోటీలో ఉండబోతున్నారు.. ఇదే సమయంలో.. బీజేపీ నుంచి



బరిలోకి దిగేందుకు మాజీ ఎంపీ, సీనియర్ నేత విజయశాంతి అలియాస్ రాములమ్మ కూడా సిద్ధం అవుతున్నారట.. బీజేపీ అభ్యర్థిగా కామారెడ్డి

మిగతా 3లో...

### మైనంపల్లి ఫ్యామిలీకి

## రెండు టిక్కెట్లు?

### కాంగ్రెస్‌లోకి జంప్



హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు

కుమారుడి టికెట్ అంశంపై మంత్రి హరీష్ రావుపై తీవ్ర వ్యాఖ్యలు చేసిన మైనంపల్లి హన్మంతరావు వారం రోజుల పాటు మల్కాజిగిరి నియోజవర్గంలో పర్యటించాలని నిర్ణయించుకున్నారు. అనుచరులు, కార్యకర్తలతో మైనంపల్లి దూలపల్లిలోని ఆయన నివాసంలో భేటీ అయ్యారు. తనను వ్యక్తిగతంగా ఎవరైనా ఇబ్బంది పెడితే తాను ఇబ్బంది పెడతానని వార్నింగ్ ఇచ్చారు. ప్రాణం పోయే వరకు ఉన్నది ఉన్నట్లుగా మాట్లాడతానన్నారు. వెనక్కి తగ్గే వ్యక్తిని కాదన్నారు. మెదక్ నియోజకవర్గంలో ముఖ్య నాయకులు ఇబ్బంది పెడుతున్నారని మైనంపల్లి ఫైర్ అయ్యారు. రేపటి నుంచి వారం పాటు

మిగతా 3లో...

## ప్రత్యర్థులను బేరీజు వేసుకుంటున్న గులాబీ

హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు

తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలకు బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీ రెడీ అవుతున్నాయి. ఏ ఏ నియోజకవర్గాల్లో ఎవరు పోటీ చేస్తారో బీఆర్ఎస్ పార్టీ ప్రకటించేసింది. టికెట్ దక్కని నేతలను దారిలోకి తెచ్చుకునేందుకు బుజ్జగించేందుకు ప్రయత్నిస్తోంది. పార్టీ సీనియర్ నేతలను రంగంలోకి దించింది. టికెట్ దక్కని నేతలకు నామినేటేడ్ పోస్టుల్లో పెద్దపీట వేస్తామని హామీలు ఇస్తోంది. పార్టీ గెలుపు కోసం పని చేయాలని సూచిస్తోంది. కొందరు నేతలు బుజ్జగింపులతో మెత్తబడినా మరికొందరు అలకవీడటం లేదు. టికెట్ దక్కిన బీఆర్ఎస్ నేతలు కొత్త లెక్కలు వేసుకుంటున్నారు. కాంగ్రెస్, బీజేపీ నుంచి ఎవరు బరిలోకి దిగుతారని ఆరా




తీస్తున్నారు. వారి సామాజిక వర్గాలు ఏంటి ?ఎన్ని కోట్లు ఖర్చు చేయగలరు ? బలహీనతలు, బలాలను తెలుసుకుంటున్నారు. కాంగ్రెస్, బీజేపీల నుంచి టికెట్ ఆశిస్తున్న వారి వివరాలు తెప్పించుకుంటున్నారు. సన్నిహితులు, పార్టీ నేతల

మిగతా 4లో...

### మళ్లీ తెలంగాణ బీజేపీలో

## వలసల పుకార్లు

హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు




తెలంగాణ బీజేపీ తీవ్ర ఒత్తిడికి గురవుతోంది. బండి సంజయ్ ను తప్పించి కిషన్ రెడ్డిని చీఫ్ గా నియమించి కొంత మంది నేతలకు పదవులు ప్రకటించిన తర్వాత .. ఇక వలసలు ఉండవని అను కున్నారు. కానీ అభ్య ర్థులు ఫైనల్ చేసే పరిస్థితికి వచ్చే సరికి పెద్ద పెద్ద నేతలు జంప్ అవబోతున్నారన్న ప్రచారం ఊపందు కుంటోంది. ఇందులో ఈటల రాజేందర్, కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి, గడ్డం వివేక్ వెంకటస్వామి వంటి నేతలు ఉన్నారు. నిజంగానే వీరంతా అదే ఆలోచనలో ఉంటే.. మరికొంత మంది సీనియర్లు కూడా తమ దారి తాము చూసుకుంటారన్న చర్చ జరుగుతోంది. ఇంటింటికి బీజేపీ కార్యక్రమంలో భాగంగా ఈటల గ్రామల్లో పర్యటిస్తున్నారు. ఈ సందర్భంగా కమలాపురం మండలానికి వెళ్లిన ఈటలకు స్థానిక కార్యకర్తలు అత్యధిక మంది కార్యకర్తలు కాంగ్రెస్‌లోకి పోవాలని డిమాండ్ చేసినట్టు ప్రచారం జరుగుతోంది. హుజురాబాద్ నియోజకవర్గంలోని మండలాల కార్యకర్తలతో చర్చించిన

మిగతా 2లో...

## ప్రగతి భవన్–రాజ్ భవన్ మధ్య సయోధ్య

హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు

తెలంగాణ ప్రభుత్వం, ముఖ్యమంత్రి కేసీఆర్‌కు, గవర్నర్ తమిళిసై సౌందరరాజన్‌కు మధ్య సత్సంబంధాలు లేవనేది బహిరంగ రహస్యం. చాలా కాలం నుంచి ప్రగతి భవన్, రాజ్ భవన్ మధ్య కోల్డ్ వార్ జరుగుతోంది. అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల సందర్భంగా కోర్టు జోక్యంతో సమస్య పరిష్కారం అయిందేమో అనుకున్నారు కానీ పరిస్థితి? మళ్లీ మొదటికి వచ్చింది. అసెంబ్లీలో ఆమోదించిన బిల్లులు కొన్ని తిప్పి పంపడం..




మళ్లీ బిల్లుల్ని పెండింగ్‌లో పెట్టడం, న్యాయసమీక్షకు పంపడంతో ప్రభుత్వం అసంతృప్తిగా ఉంది.

మిగతా 3లో...

### గిరిజనుల కోసం

## గిరిజన బంధు



హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు

తెలంగాణలో అధికారమే లక్ష్యంగా కాంగ్రెస్ తన వ్యూహాలకు పదును పెడుతోంది. ప్రజాకర్షక పథకాలతో ప్రణాళికలను సిద్ధం చేసుకుంటోంది. అన్ని వర్గాల ప్రజలను ఆకట్టుకునేలా చేవెళ్ల డిక్లరేషన్‌ను ప్రకటించింది. చేవెళ్లలో నిర్వహిస్తున్న ప్రజాగర్జన బహిరంగ సభలో ఎస్సీ, ఎస్టీ డిక్లరేషన్‌ను విడుదల

మిగతా 2లో...

## తమిళనాడులో ఘోర రైలు ప్రమాదం

(మొదటి పేజీ తరువాయి)

సిలిండర్‌పై టీ చేస్తుండగా ఈ ప్రమాదం జరిగినట్లు దక్షిణ రైల్వే అధికారులు తెలిపారు. ఇక వివరాల్లోకి వెళ్తే ఈ ప్రైవేట్ పార్టీ కోచ్ ఆగస్టు 17న ఉత్తరప్రదేశ్‌లోని లక్నో నుంచి తన ప్రయాణాన్ని మొదలుపెట్టింది. అయితే శుక్రవారం రోజున నాగర్‌కొయిల్ జంక్షన్ వద్దకు రాగానే దీన్ని పునలూరు-మదుపై ఎక్స్‌ప్రెస్ రైలుకు అనుసంధానం చేశారు. నిన్ని రాత్రిపూట మదురై రైల్వేస్టేషన్ వద్ద దీన్ని వేరు చేసి స్టాబ్లింగ్ లైన్‌లో నిలిపి ఉంచారు.అయితే ఈ ప్రైవేట్ పార్టీ కోట్‌లో ప్రయాణిస్తున్నవారిలో ఒకరు రహస్యంగా గ్యాస్ సిలిండర్‌ను రైల్లోకి తీసుకొచ్చారు. ఇక శనివారం తెల్లవారుజామున దానిపై టీ చేస్తున్నారు. అలా చేస్తుండగా ఒక్కసారిగా అది పేలిపోయింది. దీంతో భారీగా మంటలు చెలరేగాయి. అలా చూస్తూ ఉండగానే బోగీ అంతటా కూడా మంటలు వేగంగా విస్తరించాయి. కొందరు ప్రయాణికులు మంటలు వ్యాప్తి చెందడాన్ని గమనించారు. వెంటనే బోగీ నుంచి కిందకి దిగిపోయారు. మరికొందరు అందులోనే చిక్కుకుపోయారు. ఈ దుర్ఘటనలో మొత్తం 10 మంది మృతి చెందారు. మరో 20 మందికి పైగా గాయపడ్డారు. ఈ ప్రమాదం జరిగిన సమయంలో ఆ బోగీలో 65 మంది ప్రయాణికులు ఉన్నట్లు రైల్వే అధికారులు తెలిపారు. ప్రస్తుతం ఈ ఘటనపై విచారణ చేస్తున్నామని పేర్కొన్నారు.ఇదిలా ఉండగా ఈ దుర్ఘటనపై రైల్వే శాఖ తీవ్రవ్రగ్భ్రాంతి వ్యక్తం చేసింది. మృతుల కుటుంబాలకు పది లక్షల రూపాయల చొప్పున ఆర్థిక సాయం ప్రకటించింది. రైల్వేశాఖ చట్టాల ప్రకారం గ్యాస్ సిలిండర్లు, యాసిడ్, కిరోసిన్, స్టవ్, పెట్రోల్, టపాకాయలు, థర్మిక్ వెల్డింగ్ వంటి పేలుడు వస్తువులను వెంటబెట్టుకొని రైల్లో ప్రయాణించడం నేరం. అందుకే దక్షిణ మధ్య రైల్వే ఇలాంటి మండే/పేలుడు వస్తువులతో రైల్లో ప్రయాణాలు చేయకూడదని కోరుతోంది. కానీ కొంతమంది ఈ విషయంపై అవగాహన లేక అలాంటి వాటిని వెంటబెట్టుకోని ప్రయాణాలు చేస్తుంటారు. ఇదిలా ఉండగా ఈ రైలు ప్రమాదంలో మృతి చెందిన బంధువులు కన్నీరుమున్నీరవుతున్నారు. ప్రస్తుతం అక్కడ సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. ఒకరు చేసిన చిన్న తప్పు వల్ల ఇంత ఘోరంగా రైలు ప్రమాదం జరగడం అలాగే? 10 మంది వరకు చనిపోవడం ఆందోళన కలిగిస్తోంది.

## ధరణిలో 8 కొత్త ఆప్షను

(మొదటి పేజీ తరువాయి)

భూసమస్యలను పరిష్కరించాలని కలెక్టర్లను ఆదేశించించింది.

- పట్టా భూములు అసైన్డ్ గా నమోదైతే భూమి రకం, భూమి వర్గీకరణ, భూమి సాగుకు సంబంధించి టీఎం-33 మాడ్యూల్ కింద పరిష్కరించుకోవడానికి అవకాశం కల్పించారు.
- భూమి రిజిస్ట్రేషన్ సమయంలో దాని విస్తీర్ణం, మార్కెట్ విలువను తెలుసుకొని రిపోర్టును కూడా పోర్టల్ లో అందుబాటులో ఉంటుంది. అంతేకాకుండా క్రయ, విక్రయాల సమయంలో భూమి మార్కెట్ విలువను తెలుసుకోవచ్చు.
- గిఫ్ట్, సేల్ డీడ్స్ రిజిస్ట్రేషన్లలో ఒక్కరికే కాకుండా ఎక్కువ మంది కొనుగోలు చేసేలా, విక్రయించే ఛాన్స్ ఉంది.
- పేరు, వ్యక్తిగత వివరాల మార్పు చేర్పులకు టీఎం-33 మాడ్యూల్‌తో సంబంధం లేకుండా అవకాశం ఇచ్చారు.
- ఏజెన్సీ ప్రాంతాలు మినహా ఇతర ప్రాంతాల్లోని వారు బ్యాంకుల్లో మార్టిగేజ్‌లకు కుల ధ్రువీకరణ పత్రం జతచేయాలనే నిబంధన ఉండేది. ఇప్పుడు అవసరం లేకండా మినహాయింపు కల్పించారు.
- సీసీఎల్ఏ, కలెక్టర్ లాగిన్లలో గ్రామ పహాణి రిపోర్టులు అందుబాటులోకి తీసుకొచ్చారు.
- దరఖాస్తు చేసుకున్నా తర్వాత పాసుపుస్తకాల్లో సమాచారం సరిచేసుకునే వెసులుబాటు కూడా కల్పించారు. ఆ సమయంలోనూ ఆ దరఖాస్తుల(రివర్టెడ్) జాబితాను ఇకపై జిల్లా కలెక్టర్లు పరిశీలించవచ్చు.

నిజానికి ధరణిలో రిజిస్ట్రేషన్ల ప్రక్రియ సవ్వంగా సాగుతున్నప్పటికీ? అనేక ఇబ్బందులు ఉన్నాయి. ఇప్పటికే 40 రకాల సమస్యల పరిష్కారంలో తప్పుల సవరణకు పలు మ్యాడ్యూల్స్ అందుబాటులోకి వచ్చాయి. ఫలితంగా పలు సమస్యలకు పరిష్కారం దొరికినట్లు అయింది. వారసత్వ భూములను కుటుంబ సభ్యుల అనుమతి లేకుండా అమ్ముకునే వీలు గతంలో లేదు. ధరణి వచ్చాక ఎవరిపేరు మీద ఉంటే వారు అమ్ముకునే స్వేచ్ఛ అమలులోకి వచ్చింది. రికార్డుల్లోకి ఎక్కని రైతులకు మార్గం లేకుండా పోయింది. అసైన్డ్ చట్టం ప్రకారం అసైనీలు చనిపోతే ఆ భూములను వారసుల పేర్లమీద మార్చాలి. కానీ అది జరగడంలేదు. ఇవే కాకుండా వ్యవసాయభూములను గజాల్లో కొన్న వాటి విషయంలో కూడా సర్కార్ నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. గజాల్లో ఉండటం ద్వారా మ్యూటేషన్ ప్రక్రియ జగటం లేదు. కేవలం గుంటలల్లో ఉంటే మాత్రమే మ్యూటేషన్ ప్రక్రియ పూర్తి అవుతుంది. అయితే దీనిపై కూడా సర్కార్ దృష్టి పెట్టినట్లు తెలుస్తోంది. కేబినెట్ సబ్ కమిటీ ఇచ్చిన సిఫార్సుల ఆధారంగా ప్రభుత్వం నిర్ణయాలు తీసుకుంటుంది.

## సత్ఫలితాలిస్తున్న హరితహారం

హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు

చేస్తున్న పని మంచిదైతే దేవుని ఆశీస్సులు కూడా ఉంటాయని ఎంపీ సంతోష్ అన్నారు. సీఎం కేసీఆర్ అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన హరితహారం సత్ఫలితాలను ఇస్తున్నదని పేర్కొన్నారు. రాష్ట్రంలో 7.7 శాతం గ్రీన్ కవర్ పెరడగమే దీనికి నిదర్శమని తెలిపారు. దేశంలో మిగితా రాష్ట్రాల్లో పచ్చదనం తగ్గితే తెలంగాణలో అడవుల రక్షణ ? సంరక్షణతో గ్రీన్ కవర్ పెరిగిందని వివరించారు. హైదరాబాద్ వెస్టులో ఫారెస్ట్ ట్రెక్ పార్క్ సందర్శకులకు, ప్రకృతి ప్రేమికులకు మంచి సౌకర్యాలు అందిస్తుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో శాసనసభ సభ్యులు ప్రకాష్ గౌడ్, కాలే యాదయ్య, రోహిత్ రెడ్డి, ఎమ్మెల్సీ సురభి వాణి దేవి, సీఎస్ శాంతికుమారి, అటవీ అభివృద్ధి సంస్థ చైర్మన్ వంటేరు ప్రతాప్ రెడ్డి, ముఖ్యమంత్రి కార్యదర్శి భూపాల్ రెడ్డి, ఓఎస్డీ ప్రియాంక వర్గీస్, పీసీసీఎఫ్ ఆర్.ఎం.డోబ్రియల్, జడ్పీ చైర్ పర్సన్ తీగల అనితా రెడ్డి, కలెక్టర్ హరీష్ తదితరులు పాల్గొన్నారు.

# జై విజ్ఞాన్... జై అనుసంధాన్

(మొదటి పేజీ తరువాయి)

ఘనస్వాగతం లభించింది. అక్కడ ఎయిర్‌పోర్టుల దిగిన వెంటనే స్వాగతం పలికేందుకు వచ్చిన ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. జై విజ్ఞాన్... జై అనుసంధాన్ అంటూ స్లోగన్స్ ఇచ్చారు. ఇది శాస్త్రవేత్తలకు మరింత బూస్టు అవుతుందన్నారు. బెంగళూరు వచ్చిన ప్రధానమంత్రిని ఆహ్వానించడానికి రాష్ట్ర ప్రభుత్వం నుంచి సీఎంగానీ, డిప్యూటీ సీఎంగానీ ఎవరూ రాలేదు. దీనిపై మోదీ మాట్లాడుతూ... శాస్త్రవేత్తలతో సమావేశమై వెళ్లిపోతాను కాబట్టి నేనే ముఖ్యమంత్రికి, గవర్నర్‌కు రావద్దని చెప్పాను. ప్రధానమంత్రిని ఆహ్వానించడానికి ఎందుకు వెళ్లలేదని ప్రభుత్వ వర్గాలను అడిగితే... ప్రధాని వస్తున్నట్టు తమకు ఎలాంటి ఆహ్వానం అందలేదని చెప్పుకొచ్చారు. విమానాశ్రయం నుంచి నేరుగా ఇస్రో చేరుకున్న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ శాస్త్రవేత్తలతో సమావేశమయ్యారు. బెంగళూరులో ల్యాండ్ అవుతున్న టైంలో ఓ ట్వీట్ చేశారు ప్రధాని. చంద్రయాన్ -3 విజయంతో దేశాన్ని ఉన్నత శిఖరాలకు తీసుకెళ్లిన శాస్త్రవేత్తలను కలుస్తుండటం చాలా ఆనందంగా ఉందన్నారు. స్పేస్ సెక్టార్లో మరిన్ని అద్భుతాలు సాధించి దేశాన్ని నడిపించడానికి శాస్త్రవేత్తల డెడికేషన్ డ్రైవింగ్ ఫోర్సుగా ఉంటుందన్నారు.

**8 కిలోమీటర్ల ప్రయాణించిన 'ప్రజ్ఞాన్**

చంద్రుడిపై రోవర్ 'ప్రజ్ఞాన్' గురించి ఇస్రో మరో అప్‌డేట్ ఇచ్చింది. అనుకున్న ప్రకారం రోవర్ ప్రయాణం కొనసాగిస్తోందని తెలిపింది. 26 కిలోల రోవర్ చంద్రుడి ఉపరితలంపై దాదాపు 8 మీటర్ల దూరాన్ని విజయవంతంగా ప్రయాణించిందని ఇస్రో తెలిపింది. రోవర్ పేలోడ్‌లు ఒఎిఖా, ంఖచీూ ఆన్ అయ్యాయని సోషల్ మీడియా ఎక్స్(ట్విటర్)లో పేర్కొంది. ప్రొపల్షన్ మాడ్యూల్, ల్యాండర్ మాడ్యూల్, రోవర్‌లోని అన్ని పేలోడ్‌లు మెరుగ్గానే పని చేస్తున్నట్లు తెలిపింది. చంద్రయాన్ గురించి ఎప్పటికప్పుడు ఇస్రో ట్విటర్‌లో పోస్ట్ చేస్తూ అప్‌డేట్లను ఇస్తోంది.ంఖచీూ అంటే ఆల్ఫా పార్టికల్ ఎక్స్-రే స్పెక్ట్రోమీటర్, ఒఎిఖా అంటే లేజర్ ప్రేరిత బ్రేక్‌డౌన్ స్పెక్ట్రోస్కోప్. ఈ పేలోడ్‌లు ల్యాండింగ్ సైట్‌కు సమీపంలోని ఎలిమెంటల్ కంపోజిషన్‌ను పొందేందుకు ఉపయోగపడతాయి. ల్యాండర్ 'విక్రమ్' నుంచి రోవర్ 'ప్రజ్ఞాన్' చంద్రుని ఉపరితలంపైకి దిగుతున్న వీడియోలను ఇస్రో విడుదల చేసింది. ల్యాండర్ ఇమేజర్ కెమెరా ద్వారా ఈ వీడియోలను చిత్రీకరించింది. మొదటి వీడియో రోవర్ ల్యాండర్ నుంచి ర్యాంప్ మీదుగా నెమ్మదిగా చంద్రుడిపైకి దిగడం చూజారడం మరియు చంద్రునిపైకి జారడం చూడవచ్చు. మరో వీడియోలో రోవర్ క్రిందికి దించేందుకు ల్యాండర్ ర్యాంప్ తెరవడం చూడొచ్చు. చంద్రుడి రహస్యాలు ఛేదించే పనిలో ఉంది చంద్రయాన్-3. జాబిల్లిపై ల్యాండ్ అయిన విక్రమ్ ల్యాండర్, అందులో నుంచి దిగి చంద్రుడి ఉపరితలంపై తిరుగుతున్న రోవర్ శాస్త్రవేత్తలకు కావాల్సిన సమాచారం చేరవేస్తున్నాయి. ఇప్పటికే చంద్రుడి ఉపరితలం ఫొటోలు, వీడియోలు కూడా పంపాయి. అయితే వాటి జీవితకాలం 14 రోజులు మాత్రమే. చంద్రుడిపై దిగిన ల్యాండర్ జాబిల్లిపై తిరుగుతున్న రోవర్ ఏ ప్రయోగాలు చేసినా ఏ ఫొటోలు, వీడియోలు తీసినా ఆ 14 రోజులే. ఏం చేసినా... అప్పుడే చేయాలి. 14 రోజులు దాటితే అంతా ప్రతికూలతే. చంద్రుడి ఉపరితలంపై ఒక రోజు అంటే భూమిపై సుమారుగా 28 రోజులతో సమానం. అంటే మన లెక్కప్రకారం 14 రోజులు చంద్రుడి ఉపరితలంపై పగలు, 14 రోజులు రాత్రి ఉంటుంది. ఈ లెక్కన ఆగస్టు 23న చంద్రుడిపై పగలు మొదలైంది. ల్యాండర్‌ను సురక్షితంగా దించాలంటే సూర్యరశ్మి అవసరం. అందుకే 23వ తేదీని సాఫ్ట్ ల్యాండ్ చేసేందుకు ఇస్రో ఎంచుకుంది. మన లెక్కన 14 రోజుల పాటు ల్యాండర్, రోవర్ చంద్రుడిపై పనిచేస్తాయి. అందుకే చంద్రుడిపై పగలు ఉండే 14 రోజులే వీటి జీవితకాలం అని ఇస్రో ప్రకటించింది. ఆ తర్వాత రాత్రి అవగానే ప్రతికూల పరిస్థితులు ఏర్పడి ల్యాండర్, రోవర్‌లోని వ్యవస్థలు పని చేయవు. ల్యాండర్ గాని, రోవర్ గాని పనిచేయడానికి.. సేకరించిన సమాచారాన్ని భూమికి పంపడానికి విద్యుత్ అవసరం. వాటికి కావాల్సిన విద్యుత్ సూర్యకాంతి నుంచి సేకరించుకుంటాయి. అందుకే చంద్రునిపై సూర్యోదయం అయ్యే సమయానికి ల్యాండర్‌ను ఇస్రో విజయవంతంగా ల్యాండ్ చేసింది. ల్యాండర్, రోవర్‌కు అమర్చిన సోలార్ ప్యానల్ సౌర శక్తిని స్వీకరించి విద్యుత్ శక్తిగా మార్చుకుంటాయి. ఆ శక్తి ద్వారా ల్యాండర్, రోవర్ పనిచేస్తాయి

**ఆగస్టు 23వ తేదీని జాతీయ అంతరిక్ష దినోత్సవం...**

చంద్రయాన్-3 మిషన్‌ను అత్యంత విజయవంతంగా చేపట్టిన భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ శాస్త్రవేత్తలను ఇవాళ ప్రధాని మోదీ కలిశారు. ఈ నేపథ్యంలో ఆయన మాట్లాడుతూ.. ఆగస్టు 23వ తేదీని ఇక నుంచి జాతీయ అంతరిక్ష దినోత్సవంగా నిర్వహించనున్నట్లు చెప్పారు. ఇక చంద్రయాన్-3కి చెందిన విక్రమ్ ల్యాండర్ దిగిన ప్రాంతాన్ని శివశక్తిగా నామకరణం చేస్తున్నట్లు ప్రధాని మోదీ వెల్లడించారు. బెంగుళూరులోని ఇస్రో టెలిమెట్రీ ట్రాకింగ్ అండ్ కమాండ్ నెట్వర్క్ మిషన్ కంట్రోల్ కాంప్లెక్స్‌లో శాస్త్రవేత్తలను మోదీ కలిశారు. చంద్రుడిపై చంద్రయాన్-2 జ్ఞాపకాలను వదిలి వెళ్లిన ప్రాంతాన్ని తిరంగాగా నామకరణం చేస్తున్నట్లు ప్రధాని మోదీ వెల్లడించారు. భారత్ సాగించిన ప్రతి ప్రయత్నానికి ఇస్రో స్ఫూర్తిగా నిలుస్తుందన్నారు. విఫలమనేది అన్నింటికీ అంతం కాదు అన్న సత్యాన్ని గుర్తు చేస్తుందన్నారు.

చంద్రయాన్ త్రీ ల్యాండింగ్ ప్రదేశానికి 'శివశక్తి' అని నామకరణం చేశారు. ఏ వైఫల్యమూ అంతిమం కాదన్నారు ప్రధాని మోదీ! ఆగస్ట్ 23వ తేదీని ఇక నుంచి 'జాతీయ అంతరిక్ష దినోత్సవం'గా ప్రకటించారు ప్రధాని! మూన్ మిషన్‌లో మహిళా శాస్త్రవేత్తల కృషిని కొనియాడారు మోదీ! మొత్తం సృష్టికి మహిళా శక్తే ఆధారమని కీర్తించారు. ప్రాచీన ఋషుల కాలాన్ని ప్రస్తావిస్తూ.. అంతరిక్ష రహస్యాలను మన రుషులు ఏనాడో వివరించారని గుర్తుచేశారు మోదీ! ఇప్పుడు ప్రపంచం మొత్తం భారతదేశ వైజ్ఞానిక శక్తిని.. మన సాంకేతికతను, మన శాస్త్రీయ స్వభావాన్ని అంగీకరిస్తున్నాయన్నారు ప్రధాని! చంద్రుడి ఉపరితలంపై చంద్రయాన్-3 దిగిన క్షణం.. ఇప్పుడు అమరత్వం చెందిందని అన్నారు. ఇస్రో అంతరిక్ష కేంద్రానికి చేరుకునే ముందు, బెంగళూరు ప్రజలను ఉద్దేశించి ప్రధాని ప్రసంగించారు, అక్కడ జై విజ్ఞాన్, జై అనుసంధాన్ అని నినదించారు.మహిళ శాస్త్రవేత్తలకు అభినందనఇస్రో ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన చంద్రయాన్-3 విజయంలో ఎంతో మంది మహిళా శాస్త్రవేత్తల పాత్ర ఉంది. శనివారం ఉదయం ప్రధాని మోదీ ఆ శాస్త్రవేత్తలను కలిసిన విషయం తెలిసిందే. బెంగుళూరులోని ఇస్రో టెలిమెట్రీ ట్రాకింగ్ కార్యాలయంలో వారిని ఆయన కలిశారు. ఈ క్రమంలో చంద్రయాన్-3 ప్రాజెక్టులో మహిళల పాత్ర అనిర్వచనీయమని ప్రధాని మోదీ వారిని అభినందించి, మెచ్చుకున్నారు. అలాగే వారితో కలిసి గ్రూపు ఫోటో కూడా దిగారు.

విక్రమ్ ల్యాండైన ప్రాంతాన్ని శివశక్తిగా ప్రధాని మోదీ నామకరణం చేశారు. అలాగే ఆగస్ట్ 23వ తేదీని ఇక నుంచి జాతీయ అంతరిక్ష దినోత్సవంగా కూడా ప్రకటించారు. ఈ నేపథ్యంలో మహిశా శాస్త్రవేత్తలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ప్రధాని తమను మెచ్చుకోవడం సంతోషంగా ఉందని తెలిపారు. అలాగే రాబోయే రోజుల్లో కూడా మార్స్, ఆదిత్య మిషన్లు చేపట్టనున్నట్లు వారు చెబుతున్నారు.విక్రమ్ ల్యాండర్ దిగిన ప్రాంతానికి శివశక్తి, అలాగే చంద్రయాన్-2 క్రాష్ అయిన ప్రాంతానికి తిరంగా పేర్లను పెట్టడం సంతోషంగా ఉందని ఇంజినీర్ పద్మావతి అన్నారు. ప్రధాని మోదీ తమ కార్యాలయానికి వచ్చి అభినందించడం సంతోషంగా ఉందని పేర్కొన్నారు. ప్రధాని మోదీ తమలో ఎంతో స్ఫూర్తిని నింపారని.. తామంతా గర్వంగా ఫీలవుతున్నామని ఇస్రో మహిళా ఇంజినీర్ సరితారెడ్డి అన్నారు.ప్రధాని మోదీతో కలిసి మాట్లాడడం చాలా సంతోషించదగ్గ విషయమని యూఆర్ రావు శాటిలైట్ సెంటర్ శాస్త్రవేత్త అన్నారు. నారీ శక్తిని గుర్తించడం, ప్రోత్సహించడం సంతోషంగా ఉందని యూఆర్ రావు శాటిలైట్ సెంటర్ శాస్త్రవేత్త ప్రియాంకా మిశ్రా పేర్కొన్నారు.గగన్‌యాన్ ప్రాజెక్టుకు చంద్రయాన్ సక్సెస్ పెద్ద ప్రేరణగా నిలుస్తుందని ఇంజినీర్ ఆర్తీ సేన్ వివరించారు. మార్క్ 3 రాకెట్‌ను మరింత శక్తివంతంగా మార్చాల్సిన సమయం దగ్గరికొచ్చిందని తెలిపారు. గగన్‌యాన్‌కు కూడా ప్రతి ఒక్కరి మద్ధతు కావాలని కోరారు.మన కండ్ల ముందు ఓ అద్భుతాన్ని చూశామని ఇంజినీర్ నిధి పోర్వాల్ అన్నారు. ఇది చరిత్రాత్మక సందర్భమని ప్రాజెక్టు మేనేజర్ సౌజన్య పేర్కొన్నారు. మిషన్ సక్సెస్ కావడం తమకు ఎంతగానో సంతోషాన్నిచ్చిందని జూనియర్ ఇంజినీర్ నిత్యా భారతి తెలిపారు.ప్రధాని ప్రసంగం ప్రేరణాత్మకంగా ఉందని ముత్తు సెల్వి అన్నారు. శివశక్తి పేరు పెట్టడం నారీ శక్తిని ప్రోత్సహించడమే అని ఇస్రో శాస్త్రవేత్త సావిత్రి తెలిపారు.

## మళ్లీ తెలంగాణ బీజేపీలో వలసల పుకార్లు

(మొదటి పేజీ తరువాయి)

తర్వాత నిర్ణయం తీసుకోకుంటానని ఆయన వారికి చెప్పినట్లుగా తెలుస్తోంది. ఈటల కాంగ్రెస్ లో చేరుతారని చాలా కాలంగా ప్రచారం జరుగుతోంది. పొంగులేటితో పాటు జూపల్లిని బీజేపీలోకి రప్పించే క్రమంలో వారే తనకు రివర్స్ కౌన్సెలింగ్ ఇచ్చారని చెప్పుకున్నారు. ఇప్పుడు ఎన్నికలకు ముందు మరోసారి ఆయనపై కార్యకర్తల ఒత్తిడి ప్రారంభించారు. మునుగోడు నియోజవర్గంలో కోమటిరెడ్డి అనుచరులు కూడా మళ్లీ కాంగ్రెస్ లోకి వెళదామని ఒత్తిడి చేస్తున్నట్లుగా చెబుతున్నారు. కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డికి రాష్ట్ర అధ్యక్ష బాధ్యతలు చేపట్టిన తర్వాత ఈటలకు ఎన్నికల మేనేజ్‌మెంట్ కమిటీ బాధ్యతలు అప్పజెప్పిన? కోమటిరెడ్డిని జాతీయ కార్యవర్గంలోకి తీసుకున్నారు. దీంతో బీజేపీ కార్యక్రమాలు సాఫీగా సాగుతాయని అందరూ అనుకున్నారు. కానీ కథ మళ్లీ మొదటికొచ్చింది. అయితే ఈసారి నాయకుల నుంచి కాకుండా కార్యకర్తల రూపంలో సెగ తగులుతున్నది. అయితే నేతలే వ్యూహాత్మకంగా కార్యకర్తల పేరుతో ఒత్తిడి చేయించుకుంటున్నారన్న విమర్శలు కూడా ఉన్నాయి. ఇక ఉత్తర తెలంగాణలో కీలక నేతగా ఉన్న గడ్డం వివేక్ తన తండ్రి అంటి పెట్టుకుని ఉన్న పార్టీలో చేరాలని అనుకుంటున్నారని చెబుతున్నారు. వారంరోజుల్లో ఆయన కాంగ్రెస్ లో చేరవచ్చని చెబుతున్నారు. పెద్దపల్లి ఎంపీ స్థానానికి బీజేపీ తరపున పోటీ చేసినా విజయం కష్టమనేని... కాంగ్రెస్ తరపున పోటీ చేస్తే బెటరని వివేక్ అనుకుంటున్నట్లుగా ప్రచారం జరుగుతోంది గతంలో బీజేపీ మాజీ అధ్యక్షులు బండి సంజయ్‌కుమార్, ఈటల, కోమటిరెడ్డి మధ్య తీవ్రమైన అంతర్గత పోరు కొనసాగింది. అనుహ్య పరిణామాల రీత్య ఆయన్ను మార్చడంతో అంతర్గత విభేదాలు సద్దుమణిగిందని భావించారు. కానీ బీజేపీ తరపున పోటీ చేసి ఎన్నికల్లో గెలవడం కష్టమని.. బీజేపీని వీడి కాంగ్రెస్‌లో చేరుదామని కార్యకర్తలు అంటున్నారు. ఎన్నికలకు మూడు, నాలుగు నెలల సమయం ఉండటంతో బీఆర్ఎస్‌ను ఎదుర్కొవడం బీజేపీకి సాధ్యం కాదనే అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తున్నారు. పాత నేతలకు, బీజేపీలో కొత్తగా చేరిన నాయకులకు మధ్య విభేదాలు తీవ్రంగా ఉన్నాయి. తెలంగాణ బీజేపీ నేతల్ని టెన్షన్ కు గురి చేస్తున్నాయి.

## గిరిజనుల కోసం గిరిజన బంధు

(మొదటి పేజీ తరువాయి)

చేయశారు ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. తెలంగాణలో అనుకూల వాతావరణం ఉన్న ధీమాలో రాష్ట్ర కాంగ్రెస్ నాయకత్వం ఉంది. ఇప్పటికే యూత్ డిక్లరేషన్, వ్యవసాయ డిక్లరేషన్లను కాంగ్రెస్ ప్రకటించింది. అధికార పార్టీ వైఫల్యాలను ఎండగడుతూ ప్రజల్లోకి దూసుకెళ్లే యత్నం చేస్తోంది తెలంగాణ కాంగ్రెస్. అధికారంలోకి వస్తే ప్రజలకు ఏం చేస్తామో చెబుతూనే వచ్చే ఎన్నికల్లో ప్రయోజనం పొందాలనుకుంటోంది. అన్ని సామాజిక వర్గాల వారీగా ప్రయోజనం చేకూర్చే పథకాలతో డిక్లరేషన్లను తయారు చేస్తోంది. ఇప్పటికే ఎస్సీ, ఎస్టీ నేతల అభిప్రాయాలను తీసుకుని డిక్లరేషన్‌ను తయారు చేశారు.చేవెళ్లలో మొదలు కానున్న బహిరంగసభలో పాల్గొనే మల్లికార్జున ఖర్గే, ఎస్సీ, ఎస్టీ డిక్లరేషన్‌ను ప్రకటిస్తారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ఏయే వర్గాలను లాభం చేకూరనుందో చెప్పనున్నారు. ఎస్సీ-ఎస్టీ డిక్లరేషన్ల ద్వారా.. ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ చెయ్యాలని కాంగ్రెస్ నిర్ణయించుకున్నట్లు తెలుస్తోంది.

కాంగ్రెస్ ప్రభుత్వంలో ఎస్సీ ఎస్టీలకు అసైన్ చేసిన భూముల్లో యాజమాన్యం హక్కులపై మల్లికార్జున ఖర్గే ప్రకటన చేయనున్నారు. ఆ భూములను అమ్ముకోవడం సహా అన్ని రకాల యాజమాన్యం హక్కులను అనుభవించవచ్చని హామీ ఇవ్వనున్నారు. పోడు భూముల అంశంపై డిక్లరేషన్‌లో స్పష్టత రానుంది. దళిత బంధు తరహాలో గిరిజన బందుపై స్పష్టత ఇవ్వనుంది కాంగ్రెస్ పార్టీ. గిరిజనులకు ఇల్లు కట్టుకునేందుకు ఆర్థిక సాయంపై కూడా ఇదే వేదికగా ప్రకటన చేశారు.


## సంపాదకీయం

# మళ్లీ తెరపైకి కావేరి వివాదం

అంతర్రాష్ట్ర నదీ జలాల వివాదాలు తలనొప్పిగా తయారయ్యాయి. కర్నాటక తమిళనాడు రాష్ట్రాల మధ్య కావేరి జలాల వివాదం చిరకాలంగా ఏటా రగులుతూనే వుంది. తెలంగాణ ఆంధ్రప్రదేశ్ మధ్య కృష్ణా జలాల పంపిణీ వివాదం, కృష్ణ నదీ లోయ బయటనున్న రాయలసీమకు నీరు మళ్ళించుకుపోడంపై పేచీ తెలిసినవే. జల వనరుల పంపిణీపై నియమించే ట్రిబ్యునళ్ళ తీర్పులు వెలువడడానికి ఏళ్ళూ పూళ్ళూ పట్టిపోడం, అవి వెలువడ్డ తర్వాత కూడా వివాదంలోని రాష్ట్రాలన్నింటికీ అంగీకారం కాకపోడం చిరకాలంగా కొనసాగుతున్న సమస్యే. కావేరి జలాల విషయంలో కర్నాటక తమిళనాడు మధ్య తాజాగా వివాదం రగులుతున్నది. వర్షాలు తగినంతగా కురిసి నదిలో నీరు పుష్కలంగా వున్నప్పుడు ఏ పేచీ తలెత్తదు. అంతా ప్రశాంతంగా వుంటుంది. కాని ఎగువ రాష్ట్రాల్లో వర్షాలు కురవకుండా నదిలో లోటు ఏర్పడినప్పుడే రగడ ఏర్పడుతుంది. ఈ ఏడాది కర్నాటకలో లోటు వర్షపాతం వల్ల కావేరిలో ప్రవాహం తగ్గిపోయిందని సమాచారం. జూన్ నుంచి ఆగస్టు 17 వరకు 587.9 మి.మీ వర్షం కురవాల్సి వుండగా, 499.4 మి.మీ మాత్రమే పడిందని చెబుతున్నారు. రుతుపవనాల వైఫల్యం వల్ల ఈ ఎద్దడి సంభవించిందని తెలుస్తున్నది. ఈ నేపథ్యంలో కర్నాటక నుంచి తగినంతగా నీటి విడుదలకు ఆదేశాలు జారీ చేయాలంటూ తమిళనాడు సుప్రీంకోర్టును ఆశ్రయించింది. దానితో కర్నాటక కూడా అత్యున్నత న్యాయస్థానంలో అప్పీలు దాఖలు చేసింది. ఏటా వివాదం తలెత్తినప్పుడల్లా తాత్కాలిక పరిష్కారాలతో సరిపుచ్చుకోడం వల్ల ఈ పేచీ మళ్ళీ మళ్ళీ రగులుతున్నది. రోజుకి 24000 క్యూసెక్కుల కావేరి నీటిని విడుదల చేసేలా కర్నాటకను ఆదేశించాలని తమిళనాడు సుప్రీంకోర్టును కోరింది. మామూలు వర్షపాతం కురిసి కావేరిలో ప్రవాహం బాగా వున్నప్పుడు తమిళనాడు ఈ విధంగా కోరడం న్యాయమవుతుంది గాని ఈ ఏడాది పరిస్థితి భిన్నంగా వుందని కర్నాటక న్యాయస్థానానికి తెలియజేసింది. ఈ ఏడాది నదిలో 28.849 టిఎంసిల నీరు లోటుగా వుందని వివరించింది. తమిళనాడులో సాధారణ వర్షపాతం రికార్డయినప్పటికీ కర్నాటకను లోటు పీడిస్తున్నదని చెబుతున్నారు. తమిళనాడుకు రోజూ 10 వేల క్యూసెక్కుల నీటిని 15 రోజుల పాటు విడుదల చేయాలని కావేరి జల నిర్వహణ సంస్థ కర్నాటకను ఆదేశించింది. ఈ నిర్ణయాన్ని పునః పరిశీలించాలని కర్నాటక వేడుకొన్నది. ఈ నేపథ్యంలో ఈ వివాదంపై విచారణ జరుపుతామని సుప్రీంకోర్టు ప్రకటించింది. తమిళనాడు 69.777 టిఎంసిల నీటిని దుర్వినియోగం చేస్తున్నదని కర్నాటక న్యాయస్థానానికి ఫిర్యాదు చేసింది. సుప్రీంకోర్టు విచారణలో ఏమి తేలుతుందో, దాని తీర్పు ఎలా వుంటుందో అనే దానిని పక్కనపెడితే ఈ వివాదం రాజకీయ మలుపులు కూడా తిరగడం గమనించవలసిన విషయం. తమిళనాడు పాలక పక్షం డిఎంకె, కర్నాటక అధికార పక్షం కాంగ్రెస్ ప్రతిపక్ష కూటమి 'ఇండియా'లో భాగస్వాములు కావడం వల్ల సిద్దరామయ్య ప్రభుత్వం తమిళనాడు పట్ల అనుకూలంగా వ్యవహరిస్తూ రాష్ట్ర ప్రయోజనాలను దెబ్బ తీస్తున్నదని కర్నాటక ప్రతిపక్షాలు బిజెపి, జెడి(ఎస్) ఆరోపించాయి. బెంగళూరులో జరిగిన అఖిలపక్ష సమావేశం ఒక సానుకూల పరిణామం. కర్నాటక రాజకీయ పక్షాలన్నీ ప్రధాని మోడీని కలిసి కావేరి నదీ జలాల పంపిణీకి సంబంధించి వాస్తవ పరిస్థితులను ఆయనకు వివరించాలని అఖిల పక్షం నిర్ణయించింది. ఈ విషయంలో సహకారం అందించడానికి బిజెపి అంగీకరించిందినదిలో నీరు తక్కువైన సంవత్సరాల్లో పంపిణీ విషయమై ఒక శాస్త్రీయమైన పద్ధతిని రూపొందించాలని కర్నాటక కోరుతున్నది. కావేరి నది కర్నాటకలోని తలకావేరిలో పుట్టి బంగాళాఖాతంలో కలుస్తున్నది. ఈలోగా తమిళనాడులోని ధర్మపురి జిల్లాలో ప్రవేశిస్తుంది. ఎక్కువ భాగం తమిళనాడులోనే ప్రవహిస్తుంది. ఆ పొడుగునా ఆ రాష్ట్రంలో పంటలకు ప్రధాన ఆధారమవుతున్నది. అందుచేత కర్నాటక తమిళనాడు మధ్య కావేరి వివాదం తరచూ నిప్పులు చెరుగుతూ వుంటుంది. దేశంలోని అంతర్రాష్ట్ర నదులన్నింటికీ అన్ని సీజన్లకు వర్తించేలా వివాద పరిష్కార పటాలను రూపొందించాలని నిపుణులు సూచిస్తున్నారు. ముఖ్యంగా నదుల్లో ప్రవాహం తగ్గినప్పుడు పరీవాహక రాష్ట్రాల మధ్య అనుసరించదగిన ఖచ్చితమైన పరిష్కారాన్ని నిర్దేశించాలని కోరుతున్నారు. ఇది తప్పనిసరిగా అనుసరించదగినది. అంతర్రాష్ట్ర నదీ జలాల వివాదాలపై పార్లమెంటు రెండు చట్టాలు చేసినప్పటికీ, ట్రిబ్యునళ్ళ ఏర్పాటుకు అవకాశాలున్నప్పటికీ పరీవాహక రాష్ట్రాల మధ్య పేచీలు నిరవధికంగా కొనసాగడం ఆందోళనకరం.

# పిల్లలకు నాణ్యమైన పోషక ఆహారం అందించాలి

**కౌతాళం ప్రభాత సూర్యుడు :** పిల్లలకు నాణ్యమైన పూజకాహారం విలువలు అందించాలని ఎంపీడీవో సుబ్బరాజు పేర్కొన్నారు శనివారంజిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కౌతాళం మండలం లోని ఎరిగేరి ఎంపీపీ ఎస్ ప్రాథమిక పాఠశాలను ఆకస్మిక తనిఖీ చేసి, టీచర్స్ అటెండెన్స్ ,రిజిస్టర్ ను పరిశీలించి ,స్కూల్ వివరములను మరియు మధ్యాహ్నం ప్రభుత్వ మెనూ వివరములను హెడ్మాస్టర్ ఆంధ్రయ్య ను అడగగా మొత్తం 5 మంది టీచర్స్ పనిచేయుచున్నారని, ఇందులో ఒకరు స్టడీ లీవ్ లో ఉన్నారని, మెనూ ప్రకారం 10.30 గంటలకు రాగి జావ ఇవ్వడం జరుగుతుందని , మధ్యాహ్నం 12.05 గంటలకు స్వీట్ పొంగలి, అన్నం, పప్పు , చారు వడ్డించడం జరుగునని తెల్పడం జరిగినది .తదనంతరం " సర్వ శిక్ష అభియాన్ " అసిస్టెంట్ ఇంజనీర్ శివ శంకర్ తో కలసి నాడు – నేడు ఫేస్ –2 పథకం క్రింద నిర్మాణం లో ఉన్న మేజర్ మరియు మైనర్ పనులను అనగా టాయ్ లెట్స్, ఎలక్ట్రిఫికేషన్ , డ్రింకింగ్ వాటర్, సంప్ తదితర వాటిని పరిశీలించడం జరిగింది. ఈ సంధర్భంగా ఎంపిడివో మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు స్కూల్ విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనము తయారు చేయించాలని, నాడు– నేడు క్రింద పనులను త్వరిత గతిన చేపట్టి, నిర్ణీత సమయం లోగా పూర్తి చేయాలని హెడ్మాస్టర్ ను ఆదేశించడం జరిగినది.



# మైనంపల్లి ఫ్యామిలీకి రెండు టిక్కెట్లు?

(మొదటిపేజీ తరువాయి)

మల్కాజ్ గిరి నియోజకవర్గంలో తిరుగుతానని ఆ తర్వాత భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తానన్నరు. బీఆర్ఎస్ పార్టీ ఇప్పటికే మైనంపల్లిని మల్కాజిగిరి అభ్యర్థిగా ప్రకటించింది. అయితే ఆయన వివాదాస్పద వ్యాఖ్యలు చేయడంతో పార్టీ నుంచి సస్పెండ్ చేయాలన్న ఆలోచన చేస్తున్నారు. ఇప్పటికే మైనంపల్లి కాకపోతే ఎవరు అన్న దిశగా అభ్యర్థి కసరత్తును కూడా ప్రారంభించినట్లుగా చెబుతున్నారు. మైనంపల్లిని ఏ క్షణమైనా సస్పెండ్ చేస్తారని చెబుతున్నారు. మైనంపల్లి కూడా తన కుమారుడికి టిక్కెట్ ఇవ్వకపోతే తాను బీఆర్ఎస్ తరపున పోటీ చేసేది లేదంటున్నారు. మైనంపల్లి పొటెన్షియల్ లీడర్ భావిస్తున్న కాంగ్రెస్ రెండు టిక్కెట్లు ఆఫర్ ఇచ్చినట్లుగా చెబుతున్నారు. శుక్రవారం కాంగ్రెస్ నేతలతో మైనంపల్లి చర్చలు జరిపారని అంటున్నారు.

మైనంపల్లికి మల్కాజిగిరి అసెంబ్లీ స్థానాన్ని, ఆయన కుమారుడు మైనంపల్లి రోహిత్‌కు మెదక్ అసెంబ్లీ స్థానాన్ని కేటాయిస్తామని కాంగ్రెస్ నేతలు హామీ ఇచ్చినట్లుగా తెలుస్తోంది. మెదక్ టికెట్ ఆశిస్తున్న తిరుపతిరెడ్డి, శశిధర్‌రెడ్డిలతో కూడా మాట్లాడారని.. మైనంపల్లి కుమారుడు పోటీ చేస్తే సహకరిస్తామని వారితో ఒప్పించినట్లుగా తెలుస్తోంది. మల్కాజిగిరి నుంచి కాంగ్రెస్ టికెట్ ఆశిస్తున్న మాజీ ఎమ్మెల్యే నందికంటి శ్రీధర్‌ను కూడా బుజ్జగిస్తున్నారు. పార్టీలో చేరిన అసంతృప్తుల బెడద ఉండదని అంటున్నారు. మైనంపల్లి ఆర్థికంగా బలవంతుడైన నేత కావడంతో కాంగ్రెస్ నేతలు మరింతగా ఆసక్తి చూపించి ఆయనను ఆకర్షంచే ప్రయత్నం చేస్తున్నారు. ఎన్నికల షెడ్యూల్ రావడానికి ఇంకా నెలన్నర వరకూ సమయం ఉంది. అందుకే మైనంపల్లి ఇటు బీఆర్ఎస్ టిక్కెట్ ను తీసుకుని పోటీ చేస్తానని చెప్పకుండా.. మరో వైపు కుమారుడి రాజకీయ భవిష్యత్ గురించి ఆలోచిస్తూ కీలక నిర్ణయం తీసుకోవాలనుకుంటున్నారు. మైనంపల్లి రోహిత్ ఇప్పటికే మెదక్ నియోజకవర్గంలో విస్తృతంగా సేవా కార్యక్రమాలు చేపట్టి అందరికీ దగ్గరయ్యారని.. కాంగ్రెస్ అభ్యర్థిగా విజయం సాధిస్తారని అంటున్నారు. మొత్తంగా కాంగ్రెస్ రెండు టిక్కెట్ల ఆఫర్ తో రెడీగా ఉంది. ఇక చాయిస్ .. మైనంపల్లిదేనని రాజకీయవర్గాలు చెబుతున్నాయినన్ను మాట్లడవద్దన్నారుమీడియాతో మాట్లాడవద్దని నాతో ఆనేత ఒట్టు వేయించుకున్నాడని మల్కాజిగిరి ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు సంచలన వ్యాఖ్యలు చేశారు. మల్కాజ్ గిరిలో పోటీ చేసినప్పుడే చెప్పాను నాకు రాజకీయ బిక్ష పెట్టిందే మెదక్ జిల్లా అని తెలిపారు. బీఆర్ఎస్, బీజేపీ, కాంగ్రెస్ వాళ్ళు ఓట్లు ఇస్తేనే గెలిచానని తెలిపారు. నన్ను వ్యక్తిగతంగా ఇబ్బంది పెడితే నేను తిడతాను అని కీలక వ్యాఖ్యలు చేశారు. రేపటి నుంచి వారం రోజులు మల్కాజ్ గిరి నియోజకవర్గంలో పర్యటిస్తానని అన్నారు. వారం రోజుల తర్వాత మీడియాతో మాట్లాడతా అని అన్నారు.

బీఆర్ఎస్ లో పెద్ద నాయకుడు నిన్న రాత్రి నాకు ఫోన్ చేశారని, తొందర పడవద్దని నాకు చెప్పారని తెలిపారు. ప్రజల నుంచి అభిప్రాయాలు తీసుకోవాలని ఆ నేత నాకు సూచించారు. నాతో ఆ నేత ఒట్టు వేయించుకున్నారు?మీడియాతో మాట్లాడవద్దని ఆ నేత కోరారని అన్నారు. నా సత్తా నాకు ఉంది? చర్యకు ప్రతి చర్య ఉంటుందని కీలక వ్యాఖ్యలు చేశారు. పార్టీ నన్ను ఏమి అనలేదు.. నేను పార్టీని ఏమి అనలేదని అన్నారు. మెదక్ లో సొంత పార్టీ నేతలపై కేసులు పెట్టారని మండిపడ్డారు. ప్రజల అభిప్రాయమే..నా అభిప్రాయమన్నారు. నేను చేంజ్ కాను?నా వయస్సు 58 ఎండ్లు అంటూ మైనంపల్లి సంచలన వ్యాఖ్యలు చేశారు. అయితే మైనంపల్లితో ఒట్టు వేయించుకున్న ఆ నేత ఎవరు? ఎందుకు మీడియాతో మాట్లాడవద్దని అన్నారు? అనే దానిపై ఉత్కంఠ నెలకొంది. మల్కాజిగిరి ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు చేసిన వ్యాఖ్యలు బీఆర్ఎస్‌లో తీవ్ర కలకలానికి దారి తీసిన సంగతి తెలిసిందే. తొలి దశ జాబితా ప్రకటించినప్పటి నుంచి హరీష్ రావును టార్గెట్ చేస్తూ తీవ్ర విమర్శలు చేస్తున్నారు. దీంతో హన్మంతరావుపై బీఆర్ఎస్ అధిష్ఠానం సీరియస్ అయింది. ఇప్పటికే ఆయనకు పార్టీ టికెట్ కేటాయించగా.. అభ్యర్థి మార్పు ఉంటుందనే ప్రచారం సాగుతోంది. ఆయన స్థానంలో మరో అభ్యర్థిని ప్రకటించేందుకు బీఆర్ఎస్ సిద్ధమైనట్లు సమాచారం. మల్కాజిగిరి సీటుతో పాటు మెదక్ సీటు కూడా తన కుమారుడికి ఇవ్వాలని హన్మంతరావు గత కొంతకాలంగా కోరుతున్నారు. ఇదే అంశంపై ఆయన ఈ నెల 21న కీలక వ్యాఖ్యలు చేసిన విషయం తెలిసిందే.

# కేసీఆర్‌తో పోటీకి రాములమ్మ

(మొదటిపేజీ తరువాయి)

అసెంబ్లీ నియోజకవర్గం నుంచి బరిలో దిగేందుకు తాను సిద్ధమని ఆమె సోషల్ మీడియా వేదికగా సంకేతాలిచ్చారు.. ఆ అవకాశం తనకే కల్పించాలంటూ.. పార్టీ అధిష్టానానికి విజయశాంతి చెప్పినట్టుగా తెలుస్తోంది. అయితే, "కామారెడ్డి అసెంబ్లీ పై నా పోటీ విషయం మా పార్టీ నిర్ణయిస్తది.. రెండు రోజులుగా పాత్రికేయ మిత్రులు, మీడియాలో వస్తున్న వార్తల ప్రసారాలపై అడుగుతున్న ప్రశ్నలకు నా సమాధానం ఇంతే.. బీజేపీ కార్యకర్తలం ఎవరైనా పార్టీ ఆదేశాలను పాటించడం మాత్రమే మా విధానం.. ఏది ఏమైనా కామారెడ్డి, గజ్వేల్ రెండు నియోజకవర్గాలలో బీజేపీ గెలుపు, తెలంగాణ భవిష్యత్తుకు తప్పనిసరి అవసరం. ఇది ప్రజలకు తెలియపర్చటం తెలంగాణ ఉద్యమకారుల అందరి బాధ్యత, బహుశా.. జై శ్రీరామ్.. హర హర మహాదేవ.. జై తెలంగాణ" అంటూ ట్వీట్ చేశారు విజయశాంతి. ఈ ట్వీట్‌తో చెప్పకనే కామారెడ్డి నుంచి బరిలోకి దిగుతాననే సంకేతాలు ఇచ్చారనే చర్చ సాగుతోంది.. బీజేపీలో తన రాజకీయ జీవితాన్ని ప్రారంభించిన విజయశాంతి.. తెలంగాణ ఉద్యమ నేపథ్యంలో తల్లి తెలంగాణ పార్టీని స్థాపించారు విజయశాంతి.. ఆ తర్వాత కేసీఆర్ నేతృత్వంలోని టీఆర్ఎస్‌లో తన పార్టీని విలీనం చేశారు రాములమ్మ.. టీఆర్ఎస్ నుంచి ఎంపీగా విజయం సాధించారు.. కానీ, ఆ తర్వాత తనకు పార్టీలో తగినంత ప్రాధాన్యత దక్కడంలేదంటూ రాజీనామా చేసి బయటకు వచ్చేశారు.. ఇక, కాంగ్రెస్ పార్టీలోనూ పనిచేశారు విజయశాంతి.. అక్కడ కూడా ఇమడలేక.. చివరకు మళ్లీ బీజేపీలోకి వచ్చేశారు.. తిరిగి తన సొంత ఇంటికి వచ్చినట్టు ఉందనే కామెంట్ కూడా చేశారు. కానీ, కేసీఆర్‌తో ఆ నాటి నుంచీ రాజకీయ విభేదాలు కొనసాగుతూనే ఉన్నాయి.. రాజకీయంగా ఇప్పటికీ కేసీర్‌ను ప్రత్యర్థిగానే భావిస్తున్న రాములమ్మ.. అవకాశం దొరికినప్పుడల్లా తెలంగాణ సర్కార్‌పై, సీఎం కేసీఆర్‌పై ఓ రేంజ్‌లో విరుచుకుపడుతున్నారు.. ఇక, సోషల్ మీడియాలో.. యాక్టివ్‌గా ఉంటున్న ఆమె.. ప్రభుత్వ విధానాలను ఎప్పటికప్పుడు ఎండగడుతున్నారు.. కొడితే పెద్ద తలకాయనే కొట్టాలన్నట్టుగా కేసీఆర్‌పై పోటీకి రెడీ అవుతున్నారట రాములమ్మ. కేసీఆర్‌ను దగ్గర నుంచి చూసిన ఆమె.. ఆయన విధానాలను ఎండగట్టడం తనకు చాలా ఈజీ అంటున్నారట. ఈ సారి కేసీఆర్ ఎంచుకున్న కామారెడ్డి నుంచే పోటీ చేయాలని భావిస్తున్నారట విజయశాంతి.. దీంతో, అగ్రనేతలు పోటీ చేసే స్థానాలపై ఆయా పార్టీల్లో అభ్యర్థుల ఎంపిక విషయంపై తెలంగాణలో రాజకీయాలు రసవత్తరంగా మారుతున్నాయి. కేసీఆర్‌పై, విజయశాంతి పోటీకి సిద్ధమవుతున్నట్లు ప్రచారం జోరుగా సాగుతోంది.. ఈ విషయాన్ని పరోక్షంగా దృవీకరిస్తూ.. పార్టీ ఆదేశిస్తే కామారెడ్డి నుండి పోటీకి రెడీ అంటూ ఆమె ట్వీట్ చేశారు.. ఇక, బీజేపీ కూడా విజయశాంతికి ఆ స్థానం నుంచే బరిలో దింపేలా ప్లాన్ చేస్తుందని సమాచారం.. ఎన్నికల్లో గెలుపోటముల మాట ఎలా ఉన్నా.. ఈ ఎన్నికల్లో బడా లీడర్ల మధ్య పోటీ.. పొలిటికల్ హీట్ పెంచబోతోంది. మరి.. కేసీఆర్ పోటీ చేస్తున్న ఆ రెండు స్థానాల నుంచి బీజేపీ ఎవరిని బరిలోకి దింపుతుంది.. రాములమ్మను నిజంగానే కామారెడ్డిలో పోటీకి పెడుతుందా? అనేది ఆసక్తికరంగా మారింది. ఇక, రాజకీయాల్లో సుదీర్ఘ అనుభవం రాములమ్మ సొంతం.. ఈ మధ్యే తాను రాజకీయాల్లో వచ్చి 25 ఏళ్లు పూర్తి చేసుకున్నారు.. "నాది పదవుల ప్రయాణ రాజకీయ జీవితం కాదు. దైవాన్ని విశ్వసించే అంతఃకరణ, తరాల తెలంగాణ ప్రజల కష్టాలు చూసి చలించి, ఉద్యమించే మనో ప్రేరణ ? రెంటి సమాహారం. ఇది బహుశా తీవ్రమైన నా సంఘర్షణా భరిత 25 సంవత్సరాల రాజకీయ పయనం కావచ్చు.. అయితే, బీజేపీ అంటే, నేను విశ్వసించే అంతఃకరణ నమ్మకం, తెలంగాణ అంటే ఆ విశ్వాసం, నమ్మకాలను మించిన నా ప్రజా ప్రయాణం. కానట్లయితే, 2005ల నేను, బీజేపీని వదిలి తెలంగాణ ఉద్యమ బాట పట్టి ఉండకపోవచ్చు. బీజేపీపై ఔఅం భాగస్వామ్య ఒత్తిడి వల్ల, నాడు ఆత్మగౌరవ తెలంగాణా ఒక్క అంశం కాకుంటే, నేను 1998 నుండి 2005 వరకూ దేశమంతా పనిచేసిన నా బీజేపీని నాడు ఎందుకు దూరం చేసుకోవాల్సి వస్తది? నేడు కొంతమంది బీజేపీ వ్యతిరేక మీడియా నా పైన చెప్తున్నట్లు, ఆ రెంటి మధ్య భవిష్యత్ ఘర్షణ? బహుశా వారి ఊహాగాన సృష్టిత అవాస్తవం" అంటూ ట్వీట్ చేశారు. 25 రాజకీయాలు చూసిన ఆమె.. ఈ సారి ఎలాగైనా చట్టసభల్లో అడుగుపెట్టాలన్న సంకల్పంతో ఉన్నారు. సినీ రంగంలో ఓ వెలుగువెలిగిన ఆమె.. లేడీ అమితాబ్‌గా ఓ ఫైర్ బ్రాండ్.. లేడీ సూపర్ స్టార్‌గా కొన్నేళ్ల పాటు వెండితెర మీద చెరగని ముద్రవేశారు.. ఆ తర్వాత రాజకీయాల్లోకి అడుగుపెట్టి అక్కడ కూడా తాను ఓ ఫైర్ బ్రాండ్ అని నిరూపించుకున్నారు.. ఎంపీగా తన సేవలు అందించారు.. ఇప్పుడు అసెంబ్లీలో అడుగుపెట్టాలని ప్రణాళికలు సిద్ధం చేసుకున్నారు.. మరి. ఈ ఎన్నికల్లో ఎలాంటి ఫలితాలు వస్తాయో వేచిచూడాలి.

# ప్రగతి భవన్–రాజ్ భవన్ మధ్య సయోధ్య

(మొదటిపేజీ తరువాయి)

అయితే ఇలాంటి సమయంలో మహేందర్ రెడ్డితో మంత్రిగా ప్రమాణం చేయించిన సందర్భంగా సీఎం కేసీఆర్ గవర్నర్‌తో ప్రత్యేకంగా భేటీ కావడం.. తర్వాతి రోజే సచివాలయం మొత్తం స్వయంగా చూపించడంతో రాజకీయవర్గాలు ఒక్క సారిగా ఆశ్చర్యపోతున్నాయి. కేసీఆర్ చర్యలు ఊహాతీతం అనుకుంటున్నారు. సచివాలయం ప్రారంభోత్సవం సమయంలో రాష్ట్ర ప్రథమ పౌరురాలిగా ఉన్న తమిళిసై సౌందరరాజన్ కు ప్రభుత్వం ఆహ్వానం పంపలేదు. కానీ తర్వాత మంత్రి జగదీష్ రెడ్డి తెలంగాణకు వ్యతిరేకంగా గవర్నర్ వ్యవహరిస్తున్నారని.. సెక్రటేరియట్ ప్రారంభోత్సవానికి రాలేదని విమర్శించారు. ఈ విమర్శల్ని సీరియస్ గా తీసుకున్న రాజ్ భవన్ ... ప్రభుత్వం అసలు రాజ్ భవన్‌కు ఆహ్వానం పంపలేదని అధికారికంగా ప్రకటించింది. గవర్నర్ కూడా రెండు, మూడు సందర్భాల్లో అసంతృప్తి వ్యక్తం చేశారు. నిజంగా ఆహ్వానం పంపి ఉంటే.. ఆ విషయాన్ని ప్రభుత్వం చెప్పి ఉండేది. కానీ సైలెంట్ గా ఉండటంతో.. గవర్నర్ ను పిలవలేదని స్పష్టయింది. అయితే ఇప్పుడు పరిస్థితి మారిపోయింది. సచివాలయంలో ఆలయం ప్రారంభోత్సవానికి గవర్నర్ ను ఆహ్వానించడమే కాదు గేటు దగ్గరకు వెళ్లి కేసీఆర్ స్వయంగా ఆహ్వానం పలికారు. తర్వాత సెక్రటేరియట్ ను స్వయంగా చూపించారు. శ్రావణ శుక్రవారం సందర్భంగా సీఎస్ శాంతికుమారితో అతిథి మర్యాదలు కూడా చేశారు. ఈ ఫోటోలన్నీ వైరల్ అయ్యారు. కేసీఆర్, గవర్నర్ మధ్య అభిప్రాయబేధాలు తొలగిపోయినట్లేనని అనుకున్నారు. బీజేపీతో బాగున్నప్పుడు గవర్నర్ తోనూ కేసీఆర్‌కు పెద్దగా పేచీ లేదు. కానీ బీజేపీపై యుద్ధం ప్రకటించిన తర్వాత... రాజ్ భవన్ విషయంలో అసంతృప్తి వ్యక్తం చేయడం ప్రారంభించింది ప్రభుత్వం. గవర్నర్ ప్రజాదర్బార్‌లు నిర్వహించాలనుకోవడంతో పాటు.. ఢిల్లీకి పంపే నివేదికల్లో రాజకీయం చేస్తున్నారన్న అభిప్రాయానికి బీఆర్ఎస్ సర్కార్ వచ్చింది. దీంతో అసలు గవర్నర్ వ్యవస్థను గుర్తించడం మానేశారు. ప్రభుత్వ పరంగా ప్రోటోకాల్ కూడా ఇవ్వలేదు. ఇటీవల ఇండిపెండెన్స్ డే సందర్భంగా రాజ్ భవన్లో ఎట్ హోమ్ కూడా హాజరు కాలేదు. గవర్నర్ రాజకీయం చేస్తున్నారని మంత్రులు తరచూ విమర్శలు చేస్తున్నారు. కానీ తన చర్యలను .. తమిళిశై ఎప్పటికప్పుడు సమర్థిం చుకుంటూనే ఉన్నారు. కేసీఆర్ రాజకీయాలు ఊహించనివిగా ఉంటాయి.

ప్రస్తుతం గవర్నర్ కోటాలో రెండు ఎమ్మెల్సీ పదవుల భర్తీకి కేబినెట్ ఆమోదించిన ఫైల్ గవర్నర్ సంతకం కోసం రాజ్ భవన్ లో ఉంది. అలాగే ఆర్టీసీ విలీనం ఫైల్ న్యాయసమీక్షలో ఉంది. ఇవి ప్రభుత్వానికి అత్యంత కీలకం. ఎన్నికల షెడ్యూల్ వస్తే.. ఎమ్మెల్సీల ఫైల్ పక్కన పెడితే మళ్లీ తర్వాత వచ్చే ప్రభుత్వమే వాటిని భర్తీ చేయాల్సి ఉంటుంది. ఇక ఆర్టీసీ కార్మికులను ప్రభుత్వంలో చేర్చే బిల్లు కూడా ప్రభుత్వానికి ముఖ్యమే. గవర్నర్ తో లొల్లి ఇలాగే కంటిన్యూ అయితే సమస్యలు వస్తాయని కేసఆర్.. రాజీకి వచ్చినట్లుగా రాజకీయం చేస్తున్నారని బీఆర్ఎస్ వర్గాలంటున్నాయి. అయితే ఇప్పుడు గవర్నర్ తో మామూలుగా ఉండటం వల్ల.. బీజేపీ, బీఆర్ఎస్ మధ్య ఏదో ఉందన్న ప్రచారం చేసే వారికి ఈ పరిణామం మరింత బలం చేకూరుస్తుంది. ఇది బీజేపీకి మరింత ఇబ్బందికరం కానుంది.

# మెదక్ జిల్లాలో రోడ్డు ప్రమాదం

## గుర్తు తెలియని వాహనం ఢీకొని ఒకరు మృతి



మెదక్ - ప్రభాత సూర్యుడు
గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో ఒక వ్యక్తి మృతి చెందాడు. ఘటన మెదక్ జిల్లా చేగుంట మండల పరిధిలోని రెడ్డిపల్లి బైపాస్ వద్ద శనివారం ఉదయం చోటుచేసుకుంది. కామారెడ్డి జిల్లా రాజంపేట గ్రామానికి చెందిన కాసం శంకర్ (63) హైదరాబాద్ వైపు తన టీవీఎస్ ఎక్సెల్ వాహనంపై వెళ్తుండగా వెనక నుండి వేగంగా వచ్చిన గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో శంకర్ అక్కడికక్కడే మృతి చెందాడు. మండల పరిధిలోని రెడ్డిపల్లి శివారులోని 44వ జాతీయ రహదారి బ్రిడ్జి దగ్గర ఈ ఘటన చోటుచేసుకుంది. చేగుంట పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రామాయంపేట ఏరియా ఆసుపత్రికి తరలించారు.

### బీజేపికిపార్టీ సీనియర్ నేత

## మామిడి భీంరెడ్డి రాజీనామా



హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు : రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ నియోజకవర్గం పరిధిలోని పెంజర్ల గ్రామానికి చెందిన భారతీయ జనతా పార్టీ సీనియర్ నాయకుడు మామిడి భీంరెడ్డి బిజేపి పార్టీకి రాజీనామా చేశారు. మామిడి భీంరెడ్డి పార్టీకి విధేయుడుగా గత 40 ఏళ్ళుగా సేవలు అందిస్తూ వస్తున్నారు. భారతీయ జనతా పార్టీ అంటే ఆయనకు ఎనలేని అభిమానం. కొత్తూరు మండల జడ్పిటిసిగా భారతీయ జనతా పార్టీ నుండి ఆయన రెండు పర్యాయాలు పోటీ చేసి ఓడిపోయారు. రాష్ట్ర పార్టీ పిలుపుమేరకు గత 40 ఏళ్లలో ఆయన అనేక కార్యక్రమాలను నిర్వహించారు. పార్టీ పటిష్టత కోసం పార్టీ అభివృద్ధి కోసం ఆయన ఒకప్పుడు కంకణ బద్ధులై ఉండేవారు. రాష్ట్రస్థాయి పరిచయాల నుండి జాతీయస్థాయిలో కూడా ఆయనకు అనేక గుర్తింపు ఉండేది.

## పూణేలో డ్రగ్ మాఫియా గుట్టు రట్టు

### -ఐదుగురు నిందితుల అరెస్టు

ముంబాయి - ప్రభాత సూర్యుడు: మహారాష్ట్రలోని పూణేలో భారీ ఎత్తున మాదక ద్రవ్యం పట్టుపడింది. డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటలిజెన్స్ (డిఆర్ఐ ) దాడుల్లో ఐదుగురు నిందితులు దొరికిపోయారు. ఈ దాడులు శుక్రవారం రాత్రి జరిగాయి. నిందితులనుంచి భారీగా డ్రగ్స్ స్వాధీనం చేసుకున్నారు. వాటి విలువ రూ.51 కోట్లు వుంటుంది. దాదాపు 101 కేజీల మెథాక్వాలోన్ను డీఆర్ఐ సీజ్ చేసింది. నిందితులు డ్రగ్స్ తో సహ హైదరాబాద్ నుంచి పుణే కు వెళుతున్నప్పుడు డిఆర్ఐ కు సమాచారం అందింది. నిందితుల్లో తెలంగాణ, మహారాష్ట్ర, ఢిల్లీ, హర్యానాకు చెందినవారు వున్నారు. పట్టుబడ్డ నిందితులు డ్రగ్స్ను వివిధ రాష్ట్రాలలో విక్రయిస్తున్నట్లు అనుమానిస్తున్నారు. తెలంగాణలో డ్రగ్స్ తయారీ కేంద్రం వున్నట్లు అధికారులు గుర్తించారు.

## ఎమ్మెల్యే మైనంపల్లి ఇంట్లో కార్యకర్తల భేటీ

మెదక్ - ప్రభాత సూర్యుడు :
మల్కాజ్గిరి ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు దూలపల్లి లోనీ తన నివాసంలో ముఖ్య అనుచరులతో కార్యకర్తలతో శనివారం కీలక భేటీ నిర్వహించారు. ఈ భేటీకి భారీగా నేతలు, కార్యకర్తలు అయన ఇంటికి చేరుకున్నారు. తన కొడుకు రోహిత్ కి మెదక్ టికెట్ ఇవ్వకపోవడంతో మంత్రి హరీష్ రావు పై మైనంపల్లి తీవ్ర ఆరోపణలు చేసిన విషయం తెలిసిందే. మైనంపల్లి వ్యాఖ్యల పై పార్టీ అధిష్టానం సీరియస్ అయింది. ఈ నేపథ్యంలో మైనంపల్లి తన నివాసంలో మల్కాజ్గిరి నియోజవర్గంలోని కార్పొరేటర్లు, మాజీ కార్పొరేటర్ లు కార్యకర్తలతో భేటీ కావడం చర్చనీయాంశమయింది.

### చెట్లను నరికి, ప్రకృతిని

## నాశనం చేస్తే విలయాలు సంభవిస్తాయి

### స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి

బాన్సువాడ - ప్రభాత సూర్యుడు : ప్రకృతి దేవుడు ఇచ్చిన వరం, ప్రకృతిని కాపాడితే అది మనలను కాపాడుతుందని స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. చెట్లను నరికి, ప్రకృతిని నాశనం చేస్తే విలయాలు సంభవిస్తాయని హెచ్చరించారు. దేశంలో ప్రతి మనిషికి సగటున కేవలం మూడు చెట్లు మాత్రమే ఉన్నాయని చెప్పారు. వాతావరణం సమతుల్యత బాగా ఉండాలంటే భూ విస్తీర్ణంలో 33 శాతం అడవులు ఉండాలి. స్వతంత్ర భారత వజ్రోత్సవాల ముగింపు సందర్భంగా చేపట్టిన కోటి వృక్షార్చనలో భాగంగా బాన్సువాడ పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీలో స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రంలో పచ్చదనం పెంచడానికి 2016లో ప్రభుత్వం 'తెలంగాణకు హరితహారం' కార్యక్రమాన్ని ప్రారంభించిందన్నారు. 230 కోట్ల మొక్కలు నాటడం లక్ష్యంగా నిర్దేశించుకోగా దానిని అధిగమించి ఇప్పటి వరకు 270 కోట్ల మొక్కలు నాటారని చెప్పారు. 2014లో తెలంగాణ రాష్ట్రం వచ్చినప్పుడు అడవుల విస్తీర్ణం 26 శాతం ఉండగా, రాష్ట్ర ప్రభుత్వం కృషి, హరితహారం కార్యక్రమంతో ఇప్పుడు 33 శాతానికి పెరిగిందని తెలిపారు. చెట్లు ఉంటే వర్షాలు పడతాయని వెల్లడించారు. చెట్లను నాటడం, సంరక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యతని చెప్పారు. ఒక్కరోజు కోటి మొక్కలు నాటే 'కోటి వృక్షార్చన' కార్యక్రమం రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతుందన్నారు.



# తెలంగాణలో కోకోకోలా పెట్టుబడులు



హైదరాబాద్ ప్రభాత సూర్యుడు : తెలంగాణలో భారీ ఎత్తున పెట్టుబడులు పెట్టాలని కోకాకోలా సంస్థ నిర్ణయం తీసుకొంది. తాజాగా తమ అదనపు పెట్టుబడులకు సంబంధించినటువంటి ప్రణాళికలను రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి కేటీఆర్కు వెల్లడించింది. ఈ మేరకు ప్రస్తుతం అమెరికా పర్యటనలో ఉన్న కేటీఆర్తో ఆ సంస్థ ఉపాధ్యక్షుడు జేమ్స్ మేక్ గ్రివి భేటీ అయ్యారు. తమ సంస్థకు భారత్ మూడో అతిపెద్ద మార్కెట్ అని జేమ్స్ తెలిపారు. అలాగే తమ కార్యకలాపాలను విస్తరించే వ్యూహంతో మరింతగా ముందుకు వెళ్తున్నామని పేర్కొన్నారు. అయితే ఇందులో భాగంగానే తెలంగాణ రాష్ట్రంలో తమ పెట్టుబడులను రెట్టింపు చేస్తున్నట్లు ఆయన వివరించారు.సిద్ధిపేట జిల్లా వాసులకు మరో శుభవార్త అందింది. జిల్లాలోని అమీన్పూర్ వద్ద సంస్థకు ఉన్న భారీ బాటిలింగ్ ప్లాంట్ విస్తరణకు గతంలోనే రూ.100 కోట్లకు పైగా పెట్టుబడులు పెట్టామని తెలిపారు. అయితే ఇప్పుడు దీనికి అదనంగా సిద్ధిపేట జిల్లాలో దాదాపు వెయ్యి కోట్ల రూపాయలతో నూతన బాటిలింగ్ ప్లాంట్ నిర్మాణానికి.. ఏప్రిల్ నెల 22వ తేదిన తెలంగాణ ప్రభుత్వంతో ఒక ఎంవోయూ కూడా కుదుర్చుకున్నట్లు పేర్కొన్నారు. ఇదిలా ఉండగా రెండో నూతన తయారీ కేంద్రాన్ని ఏర్పాటు చేసేందుకు కూడా సంసిద్ధంగా ఉన్నామని సంస్థ ప్రకటించింది. కరీంనగర్ లేదా వరంగల్ ప్రాంతంలో ఈ తయారీ కేంద్రం వచ్చే అవకాశాలు ఉన్నాయని పేర్కొంది. ప్రతిపాదిత నూతన తయారీ ప్లాంట్ పెట్టుబడితో కలిపి దాదాపుగా రూ.2,500 కోట్లకు పైగా పెట్టుబడులను.. తెలంగాణలో పెట్టినట్లు అవుతుందని కోకాకోలా సంస్థ ప్రతినిధులు మంత్రి కేటీఆర్కు తెలియజేశారు. మరో విషయం ఏంటంటే కోకాకోలా సంస్థ తమ పెట్టుబడులను రెట్టింపు చేసేందుకు నిర్ణయం తీసుకోవడంపై ఐటీశాఖ మంత్రి కేటీఆర్ ఆ సంస్థకు ధన్యవాదాలు తెలిపారు. త్వరలోనే ఆ సంస్థ ప్రతిపాదిస్తున్న నూతన రెండో తయారీ కేంద్రానికి అవసరమైన అన్ని రకాల సహాయ సహకారాలు అందిస్తామని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రానికి అన్ని రంగాల్లో పెద్ద ఎత్తున పెట్టుబడులు వస్తున్నాయనడానికి తాజాగా కోకాకోలా సంస్థ ప్రకటించిన అదనపు పెట్టుబడులే సాక్ష్యంగా నిలుస్తాయని మంత్రి కేటీఆర్ అన్నారు. ఇదిలా ఉండగా కొన్ని రోజుల క్రితం కే?టీఆర్ అమెరికాకి వెళ్లిన సంగతి తెలిసిందే. అయితే ఆయన అక్కడ వివిధ సంస్థల ప్రతినిధులతో భేటీ అవుతూ రాష్ట్రానికి పెట్టుబడులు పెట్టే దిశగా అడుగులు వేస్తున్నారు.భారీ పెట్టుబడులు...తెలంగాణ రాష్ట్రానికి పెట్టుబడుల వరద కొనసాగుతోంది. పెంపుడు జంతువుల ఆహార తయారీ సంస్థ రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వచ్చింది. ఇప్పటికే సిద్ధిపేటలో రెండు వందల కోట్లు పెట్టుబడిపెట్టిన మార్స్ గ్రూప్ తెలంగాణలో మరో రూ.800 కోట్ల పెట్టుబడి పెట్టేందుకు సంసిద్ధత వ్యక్తంచేసింది. అంతర్జాతీయ సంస్థగా పేరుపొందిన మార్స్ గ్రూప్ తెలంగాణలో వ్యాపార విస్తరణ దిశగా అడుగులు వేస్తోంది. శుక్రవారం మార్స్ సంస్థ చీఫ్ డేటా అండ్ అనలిటిక్స్ ఆఫీసర్ శేఖర్ కృష్ణమూర్తి బృందం అమెరికా పర్యటనలో ఉన్న మంత్రి కేటీఆర్తో సమావేశమైంది. అనంతరం కొత్తశేఖర్ కృష్ణమూర్తి మాట్లాడుతూ... ఇప్పటికే తాము సిద్ధిపేట జిల్లాలో రూ.200 కోట్లు పెట్టుబడులు పెట్టామన్నారు. ఈ పరిశ్రమలో పెంపుడు జంతువుల ఆహార తయారీ చేస్తూ పెద్దఎత్తున కార్యకలాపాలు నిర్వహిస్తున్నామన్నారు. 2021 డిసెంబరులో అదనంగా రూ.500 కోట్ల పెట్టుబడితో కార్యకలాపాల విస్తరణకు తెలంగాణ ప్రభుత్వంతో ఒప్పందం చేసుకున్నట్లు చెప్పారు. తమ సంస్థ ఉత్పత్తులక భారీ ఎత్తున పెట్టుబడి పెట్టి విస్తరిస్తున్న మార్స్ గ్రూప్ సంస్థకు ధన్యవాదాలు తెలిపారు. కేవలం రూ.200 కోట్ల పెట్టుబడితో ప్రారంభమైన సంస్థ.. రూ.1500 కోట్ల స్థాయికి చేరిందని అన్నారు. ఇది రాష్ట్రంలో పరిశ్రమల ఏర్పాటుకు ఉన్న అనుకూలతను వివరిస్తుందని చెప్పారు. భవిష్యత్లోనూ సంస్థ మరింతగా తెలంగాణ కేంద్రంగా విస్తరిస్తుందన్న ఆశాభావాన్ని కేటీఆర్ వ్యక్తం చేశారు. అంతర్జాతీయంగా ప్రసిద్ధి చెందిన ప్రఖ్యాత ఓమ్నికాం గ్రూప్ హైదరాబాద్లో తమ గ్లోబల్ కేపబిలిటీ సెంటర్ ఏర్పాటుకు ముందుకొచ్చింది. మంత్రి కేటీఆర్తో న్యూయార్క్లో సంస్థ సీనియర్ ప్రతినిధి బృందం సమావేశమైంది. అనంతరం దీనిపై మంత్రి స్పందిస్తూ.. ఓమ్నికాంతో మే నెలలో ప్రాథమిక చర్చలు జరిపామని, అవి ఫలించి హైదరాబాద్లో వారు సెంటర్ ఏర్పాటు చేస్తుండటం గొప్ప విషయం అన్నారు. ఈ కేపబులిటీ సెంటర్ ఏర్పాటుతో తెలంగాణలో 2,500 మందికి పైగా ఉద్యోగ అవకాశాలు దక్కుతాయని కేటీఆర్ అన్నారు. ఓమ్నికాం సంస్థ గ్లోబల్ ఎగ్జిక్యూటివ్ వైస్ప్రెసిడెంట్ జైద్ అల్ రషీద్ మాట్లాడారు. గ్లోబల్ కేపబిలిటీ సెంటర్ ఏర్పాటు కోసం భారతదేశం తోపాటు అంతర్జాతీయంగా అనేక ఇతర నగరాలను పరిశీలించామన్నారు. చివరకు హైదరాబాద్లో ఏర్పాటుకు నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. 100 దేశాల్లో తమ సంస్థ కార్యకలాపాలు కొనసాగు తున్నాయన్నారు. భారత్లో మరింత విస్తరించేందుకు ఈ కేంద్రం దోహదపడుతుందన్నారు. తెలంగాణలో పెట్టుబడి పెట్టడం ఆనందంగా ఉందన్నారు.

### 27 న చాత్తాద శ్రీవైష్ణవ భవననిర్మాణ

## భూమి పూజ కార్యక్రమానికి తరలిరండి



హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు : ఈనెల 27 ఆదివారం రోజున మేడ్చల్ జిల్లా పీర్జాదీ గూడ లో ప్రభుత్వం కేటాయించిన స్థలములో చాత్తాద శ్రీవైష్ణవ భవన భూమి పూజ శంకుస్థాపన మహోత్సవ కార్యక్రమానికి చాత్తాద శ్రీవైష్ణవ బంధువులందరు వేల సంఖ్యలో తరలి వచ్చి మన ఐఖ్యతను ,మన బలం బలగం ప్రభుత్వానికి చాటాలని తెలంగాణా చాత్తాద శ్రీవైష్ణవ సంఘం రాష్ట్ర అధ్యక్షులు అశ్వాపురం వేణు మాధవ్, ఉపాధ్యక్షులు టి.కేశవకుమార్ లు పిలుపునిచ్చారు. ప్రముఖులతో వైభవంగా భవన నిర్మాణ భూమి పూజ జరుగునని తెలిపారు. ఈ భూమి పూజ శంకుస్థాపన మహోత్సవ కార్యక్రమానికి రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖమంత్రి గంగుల కమలాకర్ ముఖ్యఅతిథిగా విచ్చేసి శంకుస్థాపన చేస్తారని వారు తెలిపారు అలాగే ఈ కార్యక్రమానికి రాష్ట్ర శాసనసభ ఉపసభాపతి టి పద్మారావు గౌడ్, కార్మిక శాఖ మంత్రి సిహెచ్ మల్లారెడ్డి, పశు సంవర్ధక శాఖా మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్, విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి, క్రీడల శాఖ మంత్రి వి శ్రీనివాస్ గౌడ్, బీసీ కమిషన్ చైర్మన్ వకులాభరణం కృష్ణ మోహన్ రావు తదితరులు హాజరవుతున్నట్లు తెలిపారు.


## తాగుబోటు సీఐ వీరంగం

### రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలు

హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు : బొల్లారం పోలీస్ స్టేషన్ పరిధిలో దారుణం జరిగింది. తాగుబోతు సిఐ శ్రీనివాస్ వీరంగం సృష్టించాడు. కారు నడుపుతూ రాజీవ్ రహ దారిపై రోడ్డుపై బోయినపల్లి మార్కెట్కి వెళ్తున్న కూర గాయల లోడ్ ను ఢీకొట్టాడు. ఘటనలో లోడ్ డ్రైవర్ శ్రీధర్ తీవ్రంగా గాయపడ్డాడు. మంత్రి గంగుల కమలాకర్ కాన్వాయ్ తో సిఐ వచ్చినట్లు బాధితులు అంటున్నారు. సిఐ కారు ముందు భాగం దెబ్బతిన్నది. కారును బోలారం పోలీసు స్టేషన్ కు తరలించారు. సిఐ శ్రీనివాస్ కు బ్రీత్ అనలైజర్ లో పరీక్షిస్తే 210 రావడం జరిగింది.



## వైద్య ఆరోగ్య పరీక్షలు ఉచితం




కౌతాళం - ప్రభాత సూర్యుడు : పోషకాహారం సరిగ్గా లేనివారు మరియు రెండు మూడు వారాల దగ్గుతో బాధపడుతున్న వారు సోమవారం ప్రభుత్వ ఆసుపత్రిలో మొబైల్ ఎక్సరే వాహనం అందుబాటులో ఉంటుంది కావున ప్రభుత్వ ఆసుపత్రికి తరలివచ్చి మీ వైద్యఆరోగ్య మును పరీక్షించుకోవాలని వైద్య సిబ్బంది పేర్కొన్నారు. వైద్య అధికారి ఆదేశాల మేరకు ఏఎన్ఎం, ఎమ్ఎల్హెచ్పి మరియు మీకు అందుబాటులో ఉండే ఆశ వర్కర్లు గ్రామ ప్రజలకు తెలి యపరుస్తూ వారిని ప్రభుత్వ ఆసుపత్రి మొబైల్ ఎక్సరే వాహనంకు పిలుచుకొని వచ్చి వారికి వైద్య ఆరోగ్య పరీక్షలు చేయించాలని కోరారు. గ్రామ ప్రజలు ఉచితంగా ప్రభుత్వ మొబైల్ ఎక్సరె వాహనంలో వైద్య ఆరోగ్య పరీక్షలు చేయించు కోవాలని, సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## ప్రత్యర్థులను బేరీజు వేసుకుంటున్న గులాబీ

(మొదటిపేజీ తరువాయి)
ద్వారా ప్రత్యర్థుల బ్యాక్ గ్రౌండ్ కనుక్కుంటున్నారు. వారి సామాజిక వర్గానికి ఎన్ని ఓట్లు ఉన్నాయి. ఏ ఏ గ్రామాల్లో కాంగ్రెస్, బీజేపీలు బలంగా ఉన్నాయి ? అన్న అంశాలపై దృష్టి సారించారు. కాంగ్రెస్, బీజేపీ పార్టీలు తమ పార్టీ తరపున పోటీ చేసే వారిని ప్రకటించకపోయినా బీఆర్ఎస్ మాత్రం ప్రతి అంశంలోనూ జాగ్రత్తగా వ్యవహరిస్తోంది. కీడెంచి మేలు ఎంచాలన్న టార్గెట్ తో పని చేస్తున్నారు. గులాబీ బాస్ ఎన్నో ఆశలతో టికెట్ కేటాయించారని గెలిచి తీరాలన్న వ్యూహాలతో నేతలు ప్రచారం షూరూ చేసేశారు. కాంగ్రెస్ క్యాండేట్ ను ఎలా ఇరుకున పెట్టాలి. బీజేపీని ఎలా దారిలోకి తెచ్చుకోవాలన్న అంశాలతో ఎజెండాను రెడీ చేసుకుంటున్నారు. కాంగ్రెస్, బీజేపీ ప్రచారంలోకి రాకముందే ఓటర్లను తమవైపు తిప్పుకునేందుకు కసరత్తు మొదలు పెట్టేశారు. గ్రామాల వారీగా పార్టీ నేతలను పిలిపించుకొని ప్రత్యర్థి ఓట్ల శాతాన్ని తెలుసుకుంటున్నారు. ఫలానా అభ్యర్థికి టికెట్ ఇస్తే ఏం చేయాలి. గత ఎన్నికల్లో బీజేపీ, కాంగ్రెస్ కు వచ్చిన ఓట్లు ఎన్ని వంటి వివరాలను బీఆర్ఎస్ క్యాండేట్లు సేకరిస్తున్నారు. కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థులు ఫిక్సయిన తర్వాత దూకుడుగా వ్యవహరించాలని బీఆర్ఎస్ నేతలు అస్త్రశస్త్రాలను సిద్ధం చేసుకుంటున్నారు. బీఆర్ఎస్ బలహీనంగా ఉన్న గ్రామాలపై నేతలు కాన్సట్రేట్ చేశారు. ప్రత్యర్థి పార్టీల సెకండ్ క్యాడర్ ను తమ వైపు తిప్పుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. వారికి ఏం కావాలో అన్ని చేసేస్తామని హామీలు ఇస్తున్నారు. నగదుతో పాటు కావాల్సిన పనులు చేసి పెడుతున్నారు. ఫ్యూచర్ పార్టీ అన్ని విధాలా అండగా ఉంటుందని భరోసా ఇస్తున్నారు.

Printed, Published and Owned by CHERUKU UPENDAR, Printed at Akshaya Printers, H/No: 7-83/2, HANUMAN NAGAR COLONY, KUNTLOOR, ABDULLAPURMET MANDAL, HAYATH NAGAR, PIN:501505, RANGAREDDY DISTRICT/ HYDERBAD CITY, TELANAGANA, EDITOR CHERUKU UPENDAR, PUBLICATION at HAMSA PUBLICATIONS, H/No: 7-83/2, HANUMAN NAGAR COLONY, KUNTLOOR, ABDULLAPURMET MANDAL, HAYATH NAGAR, PIN:501505, RANGAREDDY DISTRICT/ HYDERBAD CITY, TELANAGANA, E-mail: upendrabbk@gmail.com, RNI:TELTEL12215